# ప్రజలు స్వచ్ఛందంగా ఓటేయాలి

- ఓటు హక్కు వినియోగించుకోవడానికి స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాం
- పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో అందరూ ఉండాలి
- 13 రకాల గుర్తింపు కార్డులు వినియోగించి ఓటేయవచ్చు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

మెదక్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి తగిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో 100 శాతం ఓటింగ్ నమోదుకు అధికార యంత్రాంగం కృషిచేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో సెల్ ఫోన్లు అనుమతి లేదన్నారు. ఎపిక్ కార్డులు పూర్తి చేశామని, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో ప్రజలు ఉండాలన్నారు. మనది ప్రజాస్వామ్య దేశమని, ప్రపంచంలో అన్ని దేశాలకంటే మనదేశంలో ఎక్కువ యువత ఉందని, నూతన ఓటర్లు దేశానికి, ప్రజాస్వామ్యానికి పునాది వంటివారని పేర్కొన్నారు. ఓటును నిర్లక్ష్యం చేయరాదని, యువత చైతన్యం కావాలని, రాజకీయ నిర్ణయాధికారం యువతదే అన్నారు. ఓటు అమ్ముకోవడం నేరమని, నూతన ఓటరు ఓటువేసి ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని గెలిపించాలని అన్నారు. కొత్త ఓటరు దేశానికి పునాది లాంటివారని పేర్కొన్నారు. యువత వారి తల్లి తండ్రులకు ఓటు గురించి వివరించాలన్నారు. కుల, మత,వర్గ, వర్ణ, ప్రాంత, భాషలాంటి తారతమ్య భేదాలు లేకుండా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. డబ్బు, మద్యం ఏదైనా వస్తువుల పంపిణీ జరిగితే, ఏదైనా ఫిర్యాదులు ఉంటే సీ–విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలని, వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు. కంట్రోల్ రూం, టోల్ ఫ్రీ నంబర్ 1950 ఫోన్‌లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఓటుహక్కు వినియోగించుకోవడానికి ఫొటోతో ఉన్న 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని పోలింగ్ స్టేషన్‌కి తీసుకురావాలని ఓటర్లకు కలెక్టర్ సూచించారు.

### 13 రకాల గుర్తింపు కార్డులు ఇవే..

1) ఓటర్ ఐడీకార్డ్ (EPIC)
2)ఆధార్ కార్డు,
3) మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్డు
4)బ్యాంక్ /పోస్ట్ ఆఫీస్ (ఫొటోతో ఉన్నవి) పాస్‌బుక్‌లు
5) కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్
6) డ్రైవింగ్ లైసెన్స్
7) పాన్ కార్డు
8) జాతీయ జనాభా రిజిస్టరు జారీచేసిన స్మార్ట్ కార్డ్
9) భారత పాస్‌పోర్టు
10) ఫొటోతో ఉన్న పింఛన్ పత్రం
11)ఉద్యోగులకు కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ/ప్రభుత్వ సంస్థలు/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీచేసిన ఫొటో గుర్తింపు కార్డు
12) దివ్యాంగుల గుర్తింపు కార్డు
13) చట్ట సభల్లో సభ్యత్వాన్ని చూపే అధికారిక గుర్తింపు కార్డులుపై గుర్తింపు కార్డులు తీసుకొని పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటు వేయాలని తెలిపారు.


చేగుంట పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది


టేక్మాల్ మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది. -టేక్మాల్, నవంబర్ 29

# చేగుంటలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు

చేగుంట, నవంబర్ 29 : చేగుంట నార్సింగి మండలాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల ఎన్నికల అధికారులు తెలిపారు. చేగుంట మండలంలో 38 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఆరుగురు చొప్పున ఎన్నికల సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు, పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఓటు వేసేందుకు వెళ్లినప్పుడు ప్రతి ఒక్కరూ ఓటరు స్లిప్‌తో పాటు ప్రభుత్వంచే గర్తింపు పొందిన కార్డులను తప్పని సరిగా వెంట తీసుకొని పోవాలని, ఓటర్లకు సెల్ ఫోన్ అనుమతి లేదన్నారు. చేగుంటలో నాలుగు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, కర్నాల్‌పల్లిలో యూత్ మోడల్ పోలింగ్ కేంద్రం పోలంపల్లిలో మహిళ మోడల్ పోలింగ్ కేంద్రం, పోతాన్‌పల్లి, చేగుంటలో మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నార్సింగి మండలంలో దుబ్బాక నియోజక వర్గానికి సంబంధించి 12, మెదక్ జిల్లాకు సంబంధించి 6 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, పోలింగ్ కేంద్రాల్లో తాగు నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, వృద్ధులకు, దివ్యాంగులకు ర్యాంప్, వీల్‌చైర్లు ఏర్పాట్లు ఏర్పాటు చేసినట్లు మండల ఎన్నికల అధికారులు గియాసిన్నాబేగం, కరీం తెలిపారు.


చేగుంటలో పోలింగ్ కేంద్రం వద్ద పారా మిలిటరీ బలగాలు


కర్నాల్‌పల్లిలో ఏర్పాటు చేసిన యూత్ మోడల్ పోలింగ్ కేంద్రం



మెదక్‌లో సిబ్బందితో చర్చిస్తున్న అధికారులు

# పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు

- ఉదయం 5.30గంటలకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో పోలింగ్
- అసత్య ప్రచారాలను నమ్మొద్దు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా


మెదక్‌లో అధికారులకు తగు సూచనలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

మెదక్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ) : పోలింగ్ అధికారులు ఈవీఎంలను, పోలింగ్ మెటీరియల్‌ను చెక్‌లిస్ట్ ప్రకారం సరిచూసుకుని, తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా సూచించారు. బుధవారం మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ సిబ్బందికి, అధికారులకు ఆయన తగు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లి ప్రతి బస్సుకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేశామని, తిరిగి రిసెప్షన్ కేంద్రాలకు వచ్చిన తర్వాత క్లోజ్డ్ కంటైనర్ల ద్వారా స్ట్రాంగ్ రూమ్‌లకు జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా తరలిస్తామన్నారు. పోలింగ్ సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లో తమకు కేటాయించిన కేంద్రాల్లోనే బస చేయాలని ఆదేశించారు. ఓటు గోప్యతకు అనుగుణంగా పోలింగ్ కేంద్రంలో కంపార్ట్మెంట్, సిబ్బంది ఏజెంట్లు కూర్చునే విధంగా సిట్టింగ్ ఏర్పాటు చేసుకొని అవసరమైన ఫారాలను సిద్ధం చేసుకొని ఉదయం 5.30 గంటలకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి క్లియర్ చేయాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌ను సందర్శించి ఈ రెండు రోజులు అత్యంత కీలకమని ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలను నిశ్చితంగా పరిశీలిస్తూ ఓటింగ్ సరళికి సంబంధించి పుకార్లు, అసత్య వార్తలు ప్రసారమవుతుంటే, వెంటనే సంబంధిత అధికారులకు తెలుపుతూ వాటి నిలుపుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్‌కు సంబంధించి ఓటింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించాలపని, ఎలాంటి చిన్న సంఘటన దృష్టికి వచ్చినా వెంటనే తెలపాలన్నారు. అనంతరం కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈసారి ప్రతి టేబుల్ దగ్గర ఓట్ల లెక్కింపును సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కౌంటింగ్ హాల్‌లో రౌండ్ వారీగా ఫలితాలను రిటర్నింగ్ అధికారి ప్రకటించేలా చూడాలని, పోలింగ్ ఏజెంట్లకు తగు వసతులు కల్పించాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి సంబంధించి రౌండ్ వారీగా ఫలితాలను ఎప్పటికప్పుడు ఇక్కడ ఏర్పాటు చేసుకున్న మీడియా కేంద్రంలో పాత్రికేయులకు తెలియజేయాలన్నారు.


హెల్త్‌చెకప్ చేసుకుంటున్న పోలీసులు